క్లుప్తంగా

నేడు మంత్రి వాకిటి రాక

అమరచింత: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆదివారం మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి రానున్నారని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.50లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం, సింగంపేటలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు మంత్రి అమరచింతకు వస్తున్నారని వెల్లడించారు.

కేఎల్ఐ కాల్వలో జమ్ము తొలగించండి..



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్, గోప్లాపూర్, అన్నారం, దావాజిపల్లి గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న కేఎల్ఐ ఎంజే-4 కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కాల్వలో జమ్ము, పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ వరి నాట్లుకు సిద్ధమవుతున్న రైతులకు సక్రమంగా సాగునీరు అందాలంటే కాల్వలో పేరుకపోయిన జమ్మును తొలగించి ముందుకు సాఫీగా సాగునీరు చేరేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

లారీని ఢీకొన్న కారు..



కొత్తకోట: ముందువెళ్తున్న లారీని కారు ఢీకొన్న సంఘటన కొత్తకోట పట్టణ సమీపంలోని ఎన్‌హెచ్ 44పై మల్లంబావి దగ్గర శనివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కర్నాటక వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, లారీ వెనకే ఉన్న హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న కారు లారీని ఢీ కొన్నది. దీంతో కారు ఇంజిన్ ముందు భాగం దెబ్బతినడం జరిగింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన యుగేందర్ రెడ్డి(50) గత వారం రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై యుగంధర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. యుగేంధర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట గ్రామనాయకుడు అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గిజిగాడి గూడు.. అందాల పొదరిల్లు



పాన్‌గల్: గూడు నిర్మాణంలో గిజిగాడికి సాటి రారెవరు. గూడులో అమరికలో గిజిగాడు ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యం నేర్పరితనం కంప్యూటర్ యుగంలో మానవుడికి సాధ్యం కానిది అంటే అతిశయోక్తి కాదు. మండలంలోని పలు గ్రామాల్లో వీటి గూళ్లు చెరువులోకి, కాల్వలోకి, బావుల్లోకి వంగిన తుమ్మ చెట్టు కొమ్మలకు, తాటి, ఈతచెట్లకు వేలాడుతూ ఆకట్టుకుంటున్నాయి. కొమ్మలకు వేలాడుతున్న గిజిగాడు గూడులు అందరిని మైమరిపిస్తుంటాయి. పాన్‌గల్, దావాజిపల్లి గ్రామ సమీపంలో తుమ్మ చెట్లకు గిజిగాడు అల్లిన రెండు గదుల గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఏకగ్రీవ పంచాయతీలకు నిరాశే



కొర్లకుంట పంచాయతీ కార్యాలయం

- రూ.10లక్షలతో ప్రోత్సాహక నిధులేవీ..
- పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల కోలాహలం
- గెలుపుకోసం ఆశావహుల గ్రూపుమీటింగ్‌లు
- మండలంలో 23,279మంది ఓటర్లు
- అభివృద్ధికి నోచుకోని తండాలు...

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయన్న సంకేతాలు రావడంతో ఎన్నికల్లో ఆశావహులు పల్లెల్లో గ్రూపు సమావేశాలకు తెరలేపారు. రిజర్వేషన్లు ఖరారైతే నేరుగా ఓటర్లను కలుసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపికైన పంచాయతీ ప్రతినిధులకు రూ.10లక్షల ప్రోత్సాహాన్ని అందజేస్తామని ఆనాటి ప్రభుత్వం ప్రకటించి ఒక్క పైసా కూడా విడుదల చెయ్యకపోవడంతో ఏకగ్రీవ పంచాయితీలలో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ దఫా జరిగే ఎన్నికల్లో అయిన ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు ప్రకటించి వెంటనే ఆ నిధులను మంజూరు చేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.

ఏకగ్రీవ పంచాయతీల్లో మిగిలింది నిరాశే..

మండలంలో కొర్లకుంట గ్రామ పంచాయతీలో 8 వార్డులతో సహా సర్పంచ్ కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంపత్‌రావుపల్లి గ్రామంలో ఆరుగురు వార్డు సభ్యులు, పుల్గర్‌చర్లలో ఇద్దరు, కల్వరాల్లలో ఒకరు, నాగర్లబండ తండా ఒక వార్డు ఏకగ్రీవంగా ఎంపిక కాగా కొర్లకుంటకు రావాల్సిన రూ.10లక్షల పారితోషికం డబ్బుల్లో పైసా కూడా విడుదల చెయ్యలేదు.

పల్లెల్లో 'పంచాయతీ' కోలాహలం

మండలంలోని 14 గ్రామ పంచాయతీలు, 8 ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరుగనున్నాయన్న సంకేతాలతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. గ్రూప్ రాజకీయాలు, విందు భోజనాలకు పలు పార్టీల నాయకులు అప్పుడే శ్రీకారం చుట్టారు. మండలంలో మొత్తం 23,279 మంది ఓటర్లు ఉండగా అందులో 11,728 పురుషులు, 11,550 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నూతన పంచాయతీల్లో ఒరిగింది శూన్యం

చిన్న గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటిని అభివృద్ధి పథంలోకి తెస్తామని ఆర్భాటంగా ప్రకటించి రంగవరం, నాగర్లబండతండా, వల్లాభాపురం తండాలను నూతన పంచాయతీలుగా ప్రకటించారు. అందులో రంగవరం, నాగర్లబండతండాకు నేటికీ ఎలాంటి అభివృద్ధి జరగకపోవడంతో ప్రజలు కూడా నిరాశకు గురవుతున్నారు.

ఏకగ్రీవమైనా.. నిరాశే మిగిలింది



మా గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నా ప్రభుత్వం ఇస్తానన్న నిధులు రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర నిరాశ మిగిలింది. అభివృద్ధిలో ఒక్కముందడుగు వేయలేదు. ఎక్కడ వేసిన గొంగడి అలాగే తండా కనిపిస్తోంది. అధికారులు ఈసారైన వసతులు కల్పించాలి.

–నారాయణ మాజీ సర్పంచ్ కొర్లకుంట

నిధులొస్తేనే ఉపయోగం



గ్రామాల్లో ఎన్నికల సమయంలో రూ.లక్షలాది ఖర్చు కాకుండా ఉండాలంటే ఏకగ్రీవంగా ఎంపిక య్యే ప్రజాప్రతినిధులను ప్రోత్సాహించాలి. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తే ఏకగ్రీవాల సంఖ్య పెరుగుతుంది.

– వెంకటేష్ మాజీ వార్డు సభ్యుడు సంపత్‌రావుపల్లి

ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు



ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామాలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రోత్సాహక నిధులు రాలేదు. మండలంలోని పలు గ్రామాల్లో పలువురు వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను కూడా ఉన్నతాధికారులకు అందజేశాం.

– శ్రీనివాసారావు ఎంపీడీఓ వీపనగండ్ల

సమ్మెకాలం వేతనం చెల్లించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం సభ్యులు

వనపర్తి టౌన్: కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించి, బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జనవరిలో 28రోజుల పాటు చేసిన సమ్మెకాలం వేతనాన్ని వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, యూఆర్ఎస్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో యుటీఎఫ్ ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న వారికి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి 7 నెలలు గడుస్తున్న వేతనం ఇవ్వకపోవడం ఏంటనీ మండిపడ్డారు. కేజీబీవీల్లో కేర్‌టేకర్‌ను నియమించాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలలో ఏకరూప టైంటేబుల్‌ను ప్రకటించి విద్యార్థులకు, సిబ్బంది న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి తిమ్మప్ప, కార్యదర్శి ఎండీ హమీద్, రాముడుగౌడ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వేరుపురుగు నుంచి పంటను కాపాడుకోవాలి

అమరచింత: చెరుకు పంటకు వేరు పురుగు సోకి పంటలు ఎండుముఖం పడకముందే నివారణ కోసం మందును పిచికారీ చేసుకుంటూ తమ పంటలను కాపాడుకోవాలని కృష్ణవేణి చెరుకు రైతుసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు పంటను సాగుచేస్తున్న రైతులు ప్రస్తుతం తేలికపాటిగా వర్షాలు కురుస్తున్న కారణంగా పంటకు వేరు పురుగు సోకే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెందిన ఆత్మకూర్ జోనల్ ఆఫీస్, శాంతినగర్ ఏరియా ఆఫీస్‌లో బేయర్ కంపెనీకి చెందిన లా సెంట మందులను పిచికారీ చేయాలని కోరారు.

సీపీఐ మండల కార్యదర్శిగా అబ్రహం

అమరచింత: సీపీఐ మండల కార్యదర్శిగా అబ్రహంను ఎన్నుకున్నామని సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్ తెలిపారు. సహాయ కార్యదర్శిగా భాస్కర్, కమిటీ సభ్యులుగా శ్యాంసుందర్, రవీందర్, గీతమ్మ, లక్ష్మీనారాయణ, కుతుబ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజి, రవి, కురుమన్న, అలివేలమ్మ, ఆనంద్‌ను ఎన్నుకోన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజాసమస్యల పరిష్కారానికి కోసం రాజీ లేని పోరాటాలు చేస్తామని అబ్రహం తెలిపారు.

'ఆవాజ్' మహాసభలు జయప్రదం చేయాలి



సమావేశమైన మైనార్టీ సంఘం సభ్యులు

కొత్తకోట: గద్వాలలో ఆదివారం జరిగే ఆవాజ్ జాతీయ స్థాయి మహాసభలకు పట్టణం నుంచి ముస్లిం సోదరులు భారీ ఎత్తున తరలివెళ్లాలని ముస్లిం సంఘం అధ్యక్షుడు, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఆవాజ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్‌లు పిలుపునిచ్చారు. ఈ విషయమై శనివారం జామే మసీదులో ముస్లిం సంఘం సభ్యులతో సమావేశమై మాట్లాడుతూ.. గద్వాలలో జరిగే ఆవాజ్ సంఘం జాతీయ మహాసభలకు వెళ్లడానికి బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆదివారం ఉదయం 10:30 గంటలకు జామే మసీదు ఏరియా మదీనా చౌక్ నుంచి బస్సు బయలుదేరుతుందని వారు పేర్కొన్నారు. మహాసభలకు ముస్లిం సోదరులు పెద్దఎత్తున రావాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం సోదరుల సంఘం ఉపాధ్యక్షుడు ఖాజామైనోద్దీన్, అహ్మద్, మోయిన్, అజీమొద్దీన్, మతిన్, చాంద్‌పాషా, ఖాలిద్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో దొంగల హల్‌చల్

- మొబైల్ షాపులు, జిరాక్స్ సెంటర్‌లో చోరీకి యత్నం



చోరీకి గురైన వెంకటేశ్వర మొబైల్‌షాపు

అమరచింత: పట్టణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు హల్‌చల్ చేశారు. బస్టాండ్‌లో ఉన్న షిరిడిసాయి కాంప్లెక్స్‌లో ఉన్న రెండు మొబైల్ షాపులు, జిరాక్స్‌సెంటర్ షెట్టర్ ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే షిరిడిసాయి కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వర మొబైల్‌షాపు తాళాలు పగులకొట్టి వాటిలోని రూ.50వేల విలువ సెల్‌ఫోన్‌తో పాటు ల్యాబ్‌టాప్‌ను ధ్వంసం చేశారు. అదేవిధంగా జూస్ సెంటర్‌లోని కౌంటర్‌లో ఉన్న రూ.వెయ్యి చోరీ చేశారు. ఎస్ఎల్ఎన్ మొబైల్ షాపు, వివణి జిరాక్స్ సెంటర్‌ల షట్టర్‌ల తాళాలను బండరాళ్లతో బాదిన పగలక పోవడంతో వెనక్కి వెళ్లారు. దీంతో ఆయా షాపుల యజమానులు ఉప్పరి వెంకటేష్‌తో పాటు పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వివరాలు తీసుకున్న నేటికీ సీసీ కెమెరాలను ఏర్పాటు చెయ్యలేక పోవడంతో రాత్రి వేలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా జీపీ భవనం



నిర్మాణం పూర్తైన చిక్కేపల్లి జీపీ భవనం

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మాణం పూర్తై ఏడాది గడిచినా నేటికీ వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం జీపీ కార్యాలయం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్నది. కమ్యూనిటీ భవనంలో కొనసాగుతుండటంతో సమావేశాలు నిర్వహించుకోవడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తై నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని వినియోగంలోకి తీసుకవచ్చి ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా జీపీ భవనం నిర్మాణం పూర్తైంది వాస్తవమేనని ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలిపి త్వరలోనే వినియోగంలోకి తీసుకవచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పచ్చదనంపై ఉద్యాన విద్యార్థుల అవగాహన



పచ్చదనంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో ఉద్యాన కళాశాల, గ్రామస్తులు నిర్వహిస్తున్న జాతీయసేవా పథక ప్రత్యేక శిబిరంలో రెండోరోజు ఉద్యాన కళాశాల విద్యార్థులు వీధులను ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే రోడ్లపై పెరిగిన వయ్యారిభామ మొక్కలను తొలగించారు. గ్రామస్తులకు పచ్చదనం పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మాజీసర్పంచ్ మన్యం, జైపాల్‌రెడ్డి వాళ్ల పెరట్లో కిచెన్ గార్డెన్ కూరగాయల విత్తనాల ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామంలోని 10 మంది రైతులకు కిచెన్ గార్డెన్ విత్తనాల కిట్‌లు ఉచితంగా ఇచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కె.భాస్కర్ వయ్యారి భామ మొక్కలను సామూహికంగా పూతదశకు రాకముందే తొలగించినట్లయితే వాటి నుంచి వచ్చే సమస్యలను అరికట్టవచ్చని, ప్రతి ఇంట్లో మన కుటుంబానికి సరిపోయే నాణ్యమైన కూరగాయలు సాగు చేసుకోని ఖర్చును తగ్గించి ఆరోగ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో 26మంది ఉద్యాన విద్యార్థులు, గట్టు కృష్ణయ్య, గట్టురాజు, జె.మన్యం, ఎ.రాములు, పెద్ద సత్యారెడ్డి, గొల్ల రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో సీపీఐ ఉద్యమాలను బలోపేతం చేసి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. మూడేండ్లకు ఒకసారి జరిగే మండల మహాసభలో గత మూడేళ్లుగా పార్టీ చేసిన కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన 12సంవత్సరాల కాలంలో మైనార్టీలకు, దళితులకు బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేట్‌పరం చేసి బీజేపీ ప్రభుత్వం విదేశీ కార్పోరేట్లకు అమ్ముడు పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్మికుల కర్షకులకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సీపీఐ అత్యధిక స్థానాల్లో పోటీచేసి గెలుపొందే విధంగా ప్రజా పోరాటాలు చెయ్యాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల, పట్టణ సీపీఐ కార్యదర్శులు అబ్రహం, రవీందర్, నాయకులు శ్రీహరి, గోపాల కృష్ణ, రమేష్, భాస్కర్, కుతుబ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జూరాల ఆనకట్టపై వెలగని వీధిలైట్లు



జూరాల ఆనకట్ట ఎడమవైపు దిమ్మెకూలి కిందకు పడిపోయిన స్తంభం

అమరచింత: ఉమ్మడి జిల్లాకే వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన వీధిలైట్లు కేవలం నిలువు స్తంభాలుగానే పరిమితమయ్యాయని, రాత్రివేలలో వెలుగులు చిమ్మడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుపై గత ఐదేళ్లుగా రాత్రి సమయంలో బల్బులు వెలగక పోతున్న అధికారులు మాత్రం సమస్యలను దాటేస్తున్నారు. ప్రతి సంవత్సరం మెంటెనెన్స్ ద్వారా నిధులు వస్తున్న జూరాల ఆనకట్టపై వీధిలైట్లు ఏర్పాటు చెయ్యలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంతెనపై ఉన్న లైటింగ్ స్థలాలు దిమ్మెలు కూలికింద పడిన వాటివైపు కన్నెత్తి చూడలేకపోతున్నారు. ఎగువ నుంచి వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్టు సందర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని ప్రాజెక్టు ఆనకట్టపై లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాముకాటుకు మహిళా కూలీ

అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లె గ్రామంలో ఓ రైతు వ్యవసాయ పొలంలో కూలీపనుల కోసం వెళ్లిన లక్ష్మి పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థకు గురైన సంఘటన శనివారం చోటుచేసుకున్నది. మండలంలోని చంద్రగడ్ గ్రామానికి చెందిన లక్ష్మితో పాటు పలువురు వ్యవసాయ మహిళా కూలీలు కొంకన్వానిపల్లెలో ఓ రైతు పొలంలో వేసిన పత్తిచేనులో కూలీ పనులకు వెళ్లింది. పని చేస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే విషయాన్ని సమీప కూలీలకు చెప్పడంతో హుటాహుటిన 108లో ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కేజీవీల్స్‌తో రహదారులు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్లు
- వాహనదారులకు ఇక్కట్లు
- డ్రైవర్లకు, యజమానులకు అవగాహన తప్పనిసరి



కేజీవీల్స్‌తో ధ్వంసమైన రోడ్లు

కొత్తకోట రూరల్: రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే అధికారులు వాటి నిర్వహణ గాలికి వదిలేస్తున్నారు. ఏడాది గడవక ముందే రోడ్లన్నీ కంకరతేలి, పగుళ్లు చూపుతున్నాయి. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో బీటీరోడ్లపై ప్రయాణిస్తుండడంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని, ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు.

నిబంధనలకు పాతర..

మండలవ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఊరికో 10 నుంచి 20 ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. వరి సాగుకు పొలాలు సిద్ధం చేసేందుకు ఈ ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో రోడ్లపైకి వస్తున్నాయి. ఇలా ట్రాక్టర్లు రావడంతో రోడ్లన్నీ ధ్వంసమై పూర్తిగా దెబ్బతిని వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. రామకృష్ణాపురం నుంచి మిరాసిపల్లికి వెళ్లే రోడ్డు, రామనంతాపురం నుంచి కొత్తకోటకు వెళ్లే దారి, అదేవిధంగా సత్యహళ్లి నుంచి అమడబాకుల వెళ్లే రోడ్డు ఇలా ప్రతి గ్రామ రోడ్లపై ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో వెళ్లడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇటీవల ఎన్‌హెచ్ 44 నుంచి భూత్పూర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్డు పనులు పూర్తి చేసింది. కేజీవీల్స్‌కు పట్టీలు లేకుండా రోడ్లపై ప్రయాణించకూడదనే నిబంధన ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం..

రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు ప్రయాణిస్తే సదరు ట్రాక్టర్ యజమానిపై, డ్రైవర్‌పై ఆర్అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు జరిమానాలు విధించాలి. తప్పనిసరైతే కేసులు నమోదు చేయాలి. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ట్రాక్టర్ల యజమానులకు, డ్రైవర్లకు భయం లేకుండా పోయింది. ఇప్పటివరకు ఒక్క ట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడం అధికారుల ఉదాసీనతకు నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం దక్కుతుంది.

చర్యలు తీసుకోవాలి



కేజీవీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి, కార్యాలయాలకు వెళా లంటే ఇబ్బందులు తప్పడం లేదు.

నక్కల శాంతన్న, కానాయపల్లి గ్రామం

కేసులు నమోదు చేస్తాం



కేజీవీల్స్ ట్రాక్టర్లతో రోడ్లపై వెళితే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా గమనిస్తే సమాచారం ఇవ్వాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. పంచాయతీల్లో చాటింపు వేయించి అవగాహన కల్పిస్తాం.

ఆనంద్, ఎస్ఐ కొత్తకోట

ట్రాక్టర్లను సీజ్ చేస్తాం



రోడ్డు భద్రతపై గ్రామస్తులు దృష్టి సారించాలి. కేజీవీల్స్‌తో ప్రయాణించి రోడ్లు ధ్వంసం చేస్తున్నారనే సమాచారం వస్తోంది. అలాంటి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.

ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొత్తకోట